క్లుప్తంగా

ప్రదీప్ నారాయణ్‌కు అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు



తెనాలి : ఏడాదిన్నర వయసులోనే అద్భుతమైన జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తూ వచ్చిన రూరల్ మండల గ్రామం గుడివాడకు చెందిన బాలుడు బండికళ్ల ప్రదీప్ నారాయణ్‌కు మరో ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఒడిషా రాష్ట్రానికి చెందిన వరల్డ్ ఛారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ వారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు–2023ను ప్రదీప్ నారాయణ్‌కు ప్రకటించారు. జ్ఞాపకశక్తి, విద్య విభాగంలో ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. పలు జాతీయ, అంతర్జాతీయ రికార్డుల్లో నమోదైన ప్రదీప్ నారాయణ్ తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ దంపతులు. సరదాగా నేర్పించిన పేర్లను గుర్తుంచుకుని చెబుతున్న కుమారుడి జ్ఞాపకశక్తికి అబ్బురపడి కొనసాగిస్తూ వచ్చారు. ఏడాదిన్నర వయసులో 1508 పైగా వస్తువులు, కూరగాయలు, జంతువుల పేర్లను నిముషాల వ్యవధిలోనే చెప్పసాగాడు. ఆ క్రమంలో పలు జాతీయ, అంతర్జాతీయ రికార్డుల్లో నమోదయ్యాడు. తాజాగా ఒడిషాకు చెందిన వరల్డ్ ఛారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ అవార్డు లభించిందని బాలుడి తండ్రి రాజేష్ తెలిపారు.

నెహ్రూనికేతన్‌లో రోబోటిక్ వైజ్ఞానిక ప్రదర్శన



తెనాలిఅర్బన్: గుంటూరుకు చెందిన రోబీవింగ్ టెక్నాలజీస్ సంస్థ సహకారంతో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ హైస్కూల్‌లో సోమవారం రోబోటిక్ వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. రోబో పని చేసే విధానం, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన అంశాలు, డ్రోన్ పని తీరు, వీడియో గేమ్స్, విద్యుద్దీపాలను సెల్‌ఫోన్ ద్వారా వెలిగించడం వంటి నమూనాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో రోబోవింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్లు సాయిరాం, సాధిక్, నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దాసరి గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



తెనాలిఅర్బన్: ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ సూచించారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఎంపీసీ విభాగంలో కె.ఫరియా 972, డి.నీలిమా 969, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పి.యశస్విని 459, జి.ఎల్.ఎస్.అర్పిత 444 మార్కులు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపల్ పి.నాగశంకర్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కల్పన ఆర్ట్స్' సదాశివరావు మృతి



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన 'కల్పన ఆర్ట్స్' వ్యవస్థాపకుడు సింహాద్రి సదాశివరావు(82) సోమవారం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 1963లో 'కల్పన ఆర్ట్స్'ను స్థాపించి సినీ, వ్యాపార, రాజకీయ, నాటక కళారంగాలకు సన్మాన పత్రాలు, పోర్ట్రెట్ బొమ్మలు, ప్రముఖ కంపెనీల లోగోలు, ట్రేడ్ బాల్స్ లోగోలు, సైన్ ఆర్ట్‌కు పేరు గాంచారు. సైన్ బోర్డులు, బ్యానర్లు ఆకర్షణీయంగా రూపొందించేవారు. సదాశివరావు వద్ద 75 మంది శిష్యులు శిక్షణ పొంది వివిధ కంపెనీలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తెనాలి ఆర్ట్స్ అండ్ యాడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా చేశారు. ఆయన మృతికి కళాభారతి కమర్షియల్ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంతాపం తెలిపింది.

నేడు కొల్లూరులో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు మంగళవారం ఉదయం కొల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కొల్లూరు మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కొల్లూరు లాకొసెంటర్‌లోని వినాయకుడి ఆలయం వద్ద నుంచి ప్రారంభమవనున్న ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

• వైఎస్సార్ సీపీ రోడ్‌షోకు 'అభిమాన' వెల్లువ



చినరావూరు పార్కు వద్ద ప్రచార సీడీని ఆవిష్కరించిన కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్



గజమాలతో సెల్ఫీ దిగుతున్న అభిమానులు



క్రేన్ సహాయంతో కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్‌లకు గజమాలతో స్వాగతం

నవ సమాజ నిర్మాణానికి ఓటు ఆయుధం



ప్రదర్శనలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసులు, శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని దానిని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రానున్న ఎన్నికల్లో వినియోగించుకోవాలని కొల్లిపర తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గుప్తా డిగ్రీ కళాశాలలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అందరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని సూచించారు. అందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను హాజరైన వారితో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, గుప్తా డిగ్రీ కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అంతా అండగా నిలవాలి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- వైఎస్సార్ సీపీలో చేరిన 32వ వార్డు టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నమ్మిన ప్రజలు ఆశీర్వదించి అధికారం ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు సంక్షేమ పథకాల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల వారిని ఆదుకున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 32వ వార్డు ఇందిరానగర్ కాలనీలో ఆత్మీయ సమావేశాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకటించిన మ్యానిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. అలాంటి జగన్‌పై ప్రతిపక్ష పార్టీలు భౌతిక దాడులకు దిగడం బాధకరమన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలందరూ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ పరిశీలకులు మండపాటి శేషగిరిరావు, లిడ్ క్యాప్ చైర్మన్ సురేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్ గెలిచిన నాటి నుంచి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారించారని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి చేసి పేదలను ఆదుకుందని చెప్పారు. పేదలు, పెత్తందారుల మధ్య జరిగే ఎన్నికల్లో అంతా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం 32వ వార్డు టీడీపీ నాయకులు షేక్ జిలానీ, కె.నవీన్, షేక్ ఆసిఫ్, ఆశీర్వాదం, షేక్ మహబూబ్, షేక్ మాలిక్, కె.సంధ్య తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయనను స్థానికులు గజమాలతో సత్కరించారు. 32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్–1, 2 అధ్యక్షులు మద్దాలి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఈద్గా గౌస్, కోగంటి అమ, రావి సాంబశివరావు, మేకల రవికుమార్, బడుగు ఏసుబాబు, పరుచూరి నల్లయ్య, చెరుకూరి సురేష్, జెబి జిలానీ, బొమ్ము నాగిరెడ్డి, కాళిదాసు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తెనాలిరూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని తెనాలి జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై తెనాలి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కాల్చి అజాగ్రత్తగా పడేయడం, గ్యాస్ లీకవడం వంటి కారణాలతో ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ఇళ్లలో వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమందించాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

35 మంది వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

తెనాలిఅర్బన్: పింఛన్ల పంపిణీ నుంచి వార్డు వలంటీర్లను తొలగించిన నేపథ్యంలో దానికి కారణమైన ప్రతిపక్ష నాయకుల కుట్రలను నిరసిస్తూ తెనాలి పట్టణంలో పలు సచివాలయాలకు చెందిన వార్డు వలంటీర్లు సోమవారం తమ ఉద్యోగాలకు మూకుమ్మడి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల పరిధిలోని అడ్మిన్‌లకు అందజేశారు. వాటిని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు అడ్మిన్‌లు పంపడంతో ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధించిందని చెప్పారు. వారి చర్యలకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో గంగానమ్మపేట 41వ సచివాలయంలో ఒకరు, సుల్తానాబాద్ 31వ సచివాలయంలో ఇద్దరు, పినపాడు 30వ సచివాలయంలో 13 మంది, మారీసుపేట 28వ సచివాలయంలో 8 మంది, పాండురంగపేట 31వ సచివాలయంలో ముగ్గురు, మాదాలవారి వీధి 31వ సచివాలయంలో ఆరుగురు ఉన్నారు. వీరంతా సోమవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. గతంలో 11, 31వ సచివాలయాలకు చెందిన ఒక్కొక్కరు రాజీనామాలు చేశారు. మొత్తం 35 రాజీనామాలను సోమవారం ఆమోదించినట్లు కమిషనర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరగడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని మురళీ బొమ్మ వద్ద వర్సూరి వారి వీధికి చెందిన బొందలపాటి రామకృష్ణ కుటుంబంతో కలసి తన స్వగ్రామం కృష్ణా జిల్లా చల్లపల్లి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి, ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఉంగరాలు అపహరణకు గురయ్యాయి. దీనిపై పోలీసులను ఆశ్రయించగా టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపహరణకు గురైన ఉంగరాల విలువ రూ.50 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

'సంక్షేమంతో ప్రతి కుటుంబానికి జగన్ చేరువయ్యారు'

- తెనాలిలో వైఎస్సార్ సీపీ రోడ్‌షో విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనం
- భౌతిక దాడులు ప్రతిపక్షాల పిరికిపంద చర్య
- దాడిని ఖండిస్తూనే హేళనగా మాట్లాడటం సిగ్గుమాలిన పని
- వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య



మీడియా సమావేశంలో ఫ్యాన్‌ను చూపుతున్న కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: తెనాలిలో జరిగిన రోడ్‌షో పాదయాత్రలో ప్రజలు బ్రహ్మరథం పట్టడం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి చేరువయ్యారని చెప్పేందుకు ప్రత్యక్ష నిదర్శనమని వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య అన్నారు. తెనాలిలో సోమవారం రాత్రి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ రోడ్‌షో పాదయాత్ర మార్కెట్ సెంటరులో ముగిసింది. పార్టీ నాయకులతో కలిసి అక్కడే మీడియాతో మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలకు వస్తున్న జన ప్రభంజనాన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు భౌతికదాడులకు పాల్పడటం పిరికిపంద చర్యగా కిలారి వెంకట రోశయ్య అభివర్ణించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే చంద్రబాబు జగన్‌పై భౌతికదాడిని ఖండిస్తూనే మరోవైపు హేళనగా మాట్లాడటం అతడి వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. చంద్రబాబు ప్రజలకు ఏమాత్రం మంచిని చేయలేదని, జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే ఇంటింటికి మంచి చేస్తూ అందరికీ చేరువయ్యారని స్పష్టం చేశారు. పేదరికం నిర్మూలనకు జగన్ తీసుకొచ్చిన మార్పులు, అందించిన సంక్షేమం మరెవ్వరి వల్లా కాదన్నారు. రైతు భరోసా కేంద్రాలతో రైతులకు అందిస్తున్న సాయం, రైతు భరోసా పెట్టుబడి సాయం, మద్దతు ధరలతో రైతాంగం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ కేవలం తెలుగు దుష్టదార పార్టీ అని చెబుతూ ఆ దుష్ప్రచారాలతోనే చంద్రబాబు జీవిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ఏదైనా మంచి జరిగిందంటే అది జగన్ పాలనలోనే అని, అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు గెలిపించుకోబోతున్నారని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనూ భారీ మెజారిటీతో గెలవబోతున్నామని, అందులో తెనాలిలో భారీ మెజారిటీ రానున్నదని స్పష్టంచేశారు.

తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ 2014 నుంచి అయిదేళ్ల ప్రతిపక్షంలో, తర్వాత ఎమ్మెల్యేగా నిరంతరం ప్రజల్లో ఉంటూ రూ.1800 కోట్ల సంక్షేమాన్ని, 27 వేల ఇళ్ల స్థలాల పట్టాలను సీఎం జగన్ ఆశీర్వాదంతో ఇవ్వగలిగినట్లు చెప్పారు. అందుకే రోడ్‌షో పాదయాత్రలో ప్రజలు తండోపతండాలుగా పాల్గొని నీరాజనాలు పలికారని చెప్పారు. సంక్షేమానికి సిసలైన నిర్వచనం ఇచ్చిన జగన్ పాలనను మెచ్చిన ప్రజలు మే 13న పోలింగ్ రోజున తమ ఓటుతో బాక్సులు బద్దలు కొట్టబోతున్నారని వ్యాఖ్యానించారు. తెనాలిలో తమకు అడుగడుగునా హారతులిస్తూ, మరోసారి జగన్‌ను సీఎం చేస్తామయ్యా...ధైర్యంగా ఉండండని ప్రజలు చెబుతున్నప్పుడు ఎంతో సంతోషం వేసిందన్నారు. ఎంపీ అభ్యర్థి, తానూ స్థానిక నాయకులమని గుర్తు చేశారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్

తెనాలిరూరల్: రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఈనెల 13న ప్రారంభమైన కొత్త బజక్ శ్యామ్ మెమోరియల్ షటిల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. గ్రామానికి చెందిన కొత్త బజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కిస్బా) ఆధ్వర్యంలో కొలకలూరు, నందివెలుగు, ఈమని, ఎరుకలపూడి, కఠెవరం గ్రామాల స్థాయిలో వెటరన్ డబుల్స్, మెన్ డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 టీములు పాల్గొన్నాయి. మెన్ డబుల్స్ విన్నర్స్‌గా శ్రీకాంత్, అలోక్, రన్నర్స్‌గా వేణు, విజ్ఞాన్, వెటరన్ డబుల్స్ విన్నర్స్‌గా వినయ్‌కుమార్, కరిముల్లా, రన్నర్స్‌గా రాంబాబు, జెర్మియా నిలిచారు. కిస్బా ఉపాధ్యక్షులు పి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు కరింశెట్టి సుబ్బారావు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యాదాత పొన్నెకంటి వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన విద్యాసంస్థలో పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, క్రీడాకారుడిగా క్రీడలను ప్రోత్సహించిన కొత్త బజక్ శ్యామ్ పేరిట సంస్థ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయుడు తన్నీరు సుబ్బారావు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. కిస్బా అధ్యక్షులు టి.రవీంద్రబాబు, న్యాయవాది ఎస్.మురళీధర్, గల్లా సతీష్, క్రీడాకారులను అభినందించారు. పోటీలకు రిఫరీలుగా మహేష్, కె.మోజెస్, ఎస్.అంబేడ్కర్ వ్యవహరించారు. కిస్బా కోశాధికారి మేకల రమేష్, కొత్త జార్జి థామస్, సిహెచ్ పీటర్‌పాల్, సిహెచ్ నాగరాజు, శివ, సత్యనారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూనంచుండూరు గ్రామానికి చెందిన సాదరబోయిన కన్నయ్య(38) మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంట సక్రమంగా పండక పోవటంతో దిగుబడి తగ్గింది. దీంతో నష్టం వాటిల్లింది. అప్పులు పెరిగి పోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన కన్నయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

నేడు 21వ వార్డు నుంచి రోడ్ షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలోని 21, 22, 23, 24, 25 వార్డులలో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం పెదరావూరుకు చెందిన మరియదాసు, అతని కుమారుడు, అల్లుడు వీరి ఇంటి ఎదురుగా నివసించే కోటేశ్వరరావుతో ఘర్షణ పడ్డారు. అంతటితో ఆగకుండా అతనిపై ముగ్గురూ దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు సోమవారం తెలిపారు.

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం


పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి



పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ స్వరూపరాణి, ఇతర పెద్దలు

తెనాలి : ప్రజలతో పనిచేస్తూ వారిని నడిపించే వారే ఆర్గానిక్ మేధావులని అంటారని, దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం ఆ కోవకు చెందుతారని ప్రముఖ రచయిత ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటీ హాలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కనపర్తి ఏసురత్నంపై చల్లపల్లి స్వరూపరాణి సంకలనంలో వెలువరించిన 'ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసురత్నం' పుస్తక ఆవిష్కరణ, పరిచయ సభకు కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన స్వరూపరాణి మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో నాలుగు దశాబ్దాల పాటు దళిత సమాజం కోసం, కుల నిర్మూలన కోసం మార్క్సిజం, అంబేడ్కరిజం జమిలిగా ఉద్యమంలో కీలకపాత్ర వహించిన మహోన్నతుడు కనపర్తి ఏసురత్నం అన్నారు. ఆయన త్యాగాలు, ఉద్యమ జీవితం విస్మరించలేనివని, ఆయన అనుభవాలు భావితరానికి అవసరమన్నారు. ఆయన ఉద్యమ మిత్రులు తనతో కలిసి సమష్టిగా ఈ పుస్తకం తీసుకొచ్చినట్టు చెప్పారు. ఏసురత్నం ప్రతి వర్ధంతికి ఒక స్మారకోపన్యాసం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. పుస్తకం తొలి కాపీని అందుకున్న కమ్యూనిటీ అండ్ రూరల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి మాట్లాడుతూ ఏసురత్నం నాస్తికుడైనా, మార్క్సిజం పట్ల, అంబేడ్కరిజంపైనా అచంచల విశ్వాసంతో దళిత ప్రజల అభివృద్ధికి కృషిచేశారని, అటువంటి వ్యక్తి జీవితాన్ని పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమని చెప్పారు. ప్రధాన వక్త, న్యాయవాది పిల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ దళిత మహాసభకు ముందే ఏసురత్నం అనేక ప్రతిఘటన పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. వేము సమత, పిల్లి వాసు, సిద్దెల అబ్రహాం, మేకతోటి ప్రభాకరరావు, కనపర్తి డేవిడ్ ప్రసంగించారు. డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ వందన సమర్పణ చేశారు.

రామాలయంలో ఘనంగా ఉత్సవ విగ్రహ ప్రతిష్ట



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి చావలి వారి వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో ఉత్సవ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వేల్పూరి సాయికృష్ణ, ఉషశ్రీ దంపతులు పాల్గొన్నారు. ఉత్సవ విగ్రహాలను పిట్ల నాగేశ్వరరావు, సుభాషిణి దంపతులు అందించారు. పోతార్లంకకు చెందిన మురళీ కృష్ణమాచార్యులు శిష్య బృందం అంకురారోపణ, పూర్ణాహుతి హోమం, ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించారు.

కంతేరులో రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.30 లక్షల నగదును పట్టుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. కంతేరు శ్రీ సిటీ వెంచర్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన పత్తిపాటి వీరయ్య అనే వ్యక్తి కారులో రూ.1.30 లక్షల నగదును తీసుకొని వెళుతుండగా తనిఖీలలో పట్టుబడ్డాడు. రశీదులు చూపించనందున ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.